సాక్షి
మంచిర్యాల
సోమవారం : 20 : మే : 2024



ఉల్లాసంగా.. ఉత్సాహంగా 8లో▸

కుమురంభీం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల క్రీడాకారులు తర్ఫీదు పొందుతున్నారు.



ఇక 'చేనేత' ఎన్నికలు

చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 12 ఏళ్ల తర్వాత ఎన్నికలకు మోక్షం లభించింది. చేనేత జౌళిశాఖ అధికారులు ఈమేరకు కసరత్తు చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /29.4

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చినుకులు పడొచ్చు.

న్యూస్‌రీల్

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషిచేద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత



క్యాండిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరం కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడారు. ప్రేమ, సంఘీభావంతో గతం నేర్పిన పాఠాలతో బంగారు భవితను నిర్మిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ, ఎన్జీవో సభ్యులు సతీశ్, రాఘవయ్య, నాగభూషణం, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

అజీంప్రేమ్‌జీ యూనివర్సిటీకి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న గ్రామస్తులు

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన ఏల్పుల రాజేందర్ అజీంప్రేమ్‌జీ యూనివర్సిటీకి ఎంపికయ్యాడు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేందర్, అతని తండ్రి శంకర్‌ను ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, గ్రామస్తులు సత్కరించారు. జాతీయ స్థాయిలో రెండో దశ రాత పరీక్షలో ప్రతిభ కనబరిచి భోపాల్ యూనివర్సిటీలోని బీఏ హానర్స్(హిస్టరీ)లో సీటు సాధించడం గొప్ప విషయమన్నారు. రాజేందర్ బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చదువుతూ ఈ సీటు సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో నరేశ్, కాలిరాం, శేషురావు, తారుఫ్‌ఖాన్, తైవర్ అలీఖాన్, శేఖర్, అంజత్‌పాషా, సక్రునాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మొదటి దఫా ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. 2024 సంవత్సరానికి ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్‌ట్రేడ్‌లలో అడ్మిషన్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులను తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్



వొడ్నాల శ్రీనివాస్

మంచిర్యాల టౌన్/రామకృష్ణాపూర్: నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్లను నియమించింది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన వొడ్నాల శ్రీనివాస్‌ను ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. కమిటీ మెంబర్లతోపాటు, జిల్లా నుంచి కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్ ఎన్నికల్లో వ్యవహరిస్తారని తెలిపారు.

అడుగంటిన ర్యాలీ వాగు..



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారంలో ర్యాలీ వాగు పూర్తిగా అడుగంటింది. ప్రస్తుతం వాగు రాళ్లు, రప్పలతో ఇలా దర్శనమిస్తోంది. చాలా ఏళ్ల తర్వాత ఇలా వాగు పూర్తిగా ఎండిపోయిందని స్థానికులు తెలిపారు. గతంలో వేసవిలో కూడా నీళ్లు ఉండేవని పేర్కొన్నారు.

పేరు మారేనా?



- సింగరేణిలో మారు పేర్లపై 3 వేల మంది విధులు
- అన్‌ఫిట్, రిటైర్ అయ్యాక ఇబ్బందులు
- కన్న బిడ్డలను కూడా నిరూపించుకోలేని దుస్థితి
- ఎన్నికల హామీగా పేర్ల క్రమబద్ధీకరణ

శ్రీరాంపూర్: సింగరేణిలో మారు పేర్లతో పనిచేస్తున్న ఉద్యోగుల పేర్లను క్రమబద్ధీకరించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. దీనిని గుర్తించిన కార్మిక సంఘాలు ఎన్నికల వేళ హామీ ఇస్తున్నాయి. గెలిచాక పట్టించుకోవడం లేదు. కేవలం ఎన్నికల అంశంగానే దీనిని కార్మిక సంఘాలు భావిస్తున్నాయి. దీంతో ఏళ్లు గడుస్తున్నా పేర్ల క్రమబద్ధీకరణకు మోక్షం కలగడం లేదు.

సంస్థ వ్యాప్తంగా 3 వేల మంది..

సింగరేణి వ్యాప్తంగా మారు పేర్లతో పనిచేసే ఉద్యోగులు సుమారు 3 వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. వీరే కాకుండా పనిచేసి ఇప్పటికే రిటైర్ అయిన వారు కూడా వేలల్లో ఉన్నారు. మెడికల్ బోర్డుకు వెళ్లి అన్‌ఫిట్ అయి మారు పేర్ల కారణంగా డిపెండెంట్ ఉద్యోగాలు రానివారు మరికొందరు ఉన్నారు. మారు పేర్ల సమస్యతో సంస్థలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

మారు పేర్లు ఎందుకు..

సింగరేణి యాజమాన్యం 1986లో పరుగుపందెం పెట్టి ఉద్యోగాలు ఇస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో గ్రామాల్లో నుంచి వేలాది మంది దరఖాస్తులు చేసుకోగా వారికి ఎంప్లాయ్‌మెంట్ కార్డులు జారీ అయ్యాయి. కార్డులు వచ్చిన వారిలో కొందరు పరుగుపందెంలో పాల్గొనడానికి ఇష్టపడలేదు. మరి కొందరికి వీలు కాలేదు. తప్పుడు అడ్రస్‌లో మరి కొన్ని రావడంతో వారి స్థానంలో ఇతరులు ఆ కార్డు పట్టుకుని వచ్చి పందెంలో పాల్గొని గెలిచారు. సింగరేణి కొలువు సాధించారు. కార్డులో ఏ పేరు ఉందో అదే పేరుతో ఉద్యోగంలో కొనసాగుతున్నారు. 1990 సమయంలో సింగరేణికి భూములిచ్చిన వారికి కూడా ఉద్యోగాలిచ్చారు. భూములు పోని వారు కూడా పోయిన వారి పేరుతో వచ్చి వారి స్థానంలో ఉద్యోగంలో చేరారు. 1998 వరకు కొందరు సింగరేణి ఉద్యోగాలను కొనుక్కున్నారు. ఇలా వివిధ కారణాలతో వారి గ్రామంలో ఉన్న సొంత పేర్లు కాకుండా మారు పేర్లతో పనిచేస్తున్నారు.

ఎన్నికలప్పుడే హామీ...

ఆరో విడత గుర్తింపు సంఘం ఎన్నికల ముందు కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఇదొకటి ఉంది. గెలిచిన తరువాత మారు పేర్లతో పనిచేసే వారి పేర్లు క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలిచింది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉంది. కానీ ఇది అమలు కాలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. టీబీజీకేఎస్ ఓడిపోయి ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా వచ్చింది. ఏఐటీయూసీ కూడా ఎన్నికలకు ముందు తాము గెలిస్తే ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ సంఘం నాయకులైనా దీనిని పరిష్కరిస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది.

విజిలెన్సు కేసులు..

పొరుగు వారితో గొడవ అయితే.. వారు కంపెనీకి ఫలానా ఉద్యోగి మారు పేర్లతో పని చేస్తున్నారంటూ ఫిర్యాదు ఇవ్వడంతో చాలా మంది విజిలెన్సు కేసులు ఎదుర్కొంటున్నారు. మారు పేర్లతో పనిచేసే వారు మెడికల్ ఇన్వాలిడేషన్ అయి వారి పిల్లలకు కారుణ్య ఉద్యోగాలు పెట్టించే ప్రయత్నంలో పేర్లలో తేడా కనిపిస్తే విజిలెన్సు కేసులు నమోదు అవుతున్నాయి. ఇంటి పేరు, తండ్రి పేరు, అభ్యర్థి పేరులో ఏమాత్రం తేడా అనిపించినా అధికారులు విజిలెన్సుకు రాస్తున్నారు. దీంతో కొడుకును కూడా కొడుకుగా నిరూపించుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తుందని మారు పేర్లతో పనిచేసే ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సాంకేతిక ఇబ్బందులు..

పేర్లు మార్చడానికి చాలా సాంకేతిక ఇబ్బందులు ఉన్నట్లు తెలిసింది. ఉద్యోగి పేరును కంపెనీ ఎద్దైనా గెజిట్‌తో మారిస్తే వారి సీఎంపీఎఫ్‌లో పేర్లు మార్చడం చాలా కష్టం. ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టి కంపెనీ తీసుకునే నిర్ణయం అంతా సులువుగా అమలు చేయడానికి సీఎంపీఎఫ్ శాఖ సిద్ధంగా ఉండదు. ఈ ఇబ్బందుల నడుమ మారు పేర్లతో పనిచేసే ఉద్యోగులు వారి భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే మారు పేర్లతో పనిచేసే వారు పేర్ల మార్పునకు యాజమాన్యం అనుమతి ఇచ్చినా తమకు తాము మారుపేర్లతో పనిచేస్తున్నామని చెప్పుకోరని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఆధార్ రాకతో తిప్పలు..

గతంలో ఎలా ఉన్నా ఆధార్ కార్డు ప్రక్రియ మొదలైన తరువాత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందరూ వారి గ్రామాల్లో భూములు ఇతర ఆస్తుల కోసం అసలు పేర్లుతో అధార్ కార్డులు తీసుకున్నారు. వారి పిల్లల చదువులు, అన్ని సర్టిఫికెట్లు కూడా కంపెనీలో ఉన్నట్లు కాకుండా స్వగ్రామంలో ఉన్నట్లు అసలు పేర్లతో కొనసాగిస్తున్నారు. ఇలా సింగరేణిలో ఒక పేరు, ఊళ్లలో ఒక పేరుతో కొనసాగుతున్నారు. ఇక మారు పేర్లతో పనిచేసిన వారికి రిటైర్మెంట్ తరువాత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెన్షన్ రావలంటే ఆధార్ కార్డు తప్పనిసరైంది. అధార్ కార్డులో ఒక పేరు, కంపెనీలో ఒక పేరు ఉండటంతో పెన్షన్ పొందలేకపోతున్నారు. ఇప్పటికే చాలా మంది పెన్షన్‌కు దూరంగా ఉన్నారు. మరో పక్క మెడికల్ అన్‌ఫిట్ అయితే వారిస్థానంలో డిపెండెంట్లకు ఉద్యోగం ఇవ్వడం సమస్యగా మారుతోంది. ఇలా చాలా మంది ఉద్యోగం పొందలేకపోయారు.

యాజమాన్యంతో చర్చిస్తాం..

మారు పేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలి. చాలా మంది కార్మికులు దీనితో ఇబ్బందులు పడుతున్నారు. కారుణ్య ఉద్యోగాలు ఇప్పించుకోవడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిటైర్ అయ్యాక పెన్షన్ పొందలేకపోతున్నారు. దీనిపై యాజమాన్యంతో చర్చించి న్యాయం చేసేలా చూస్తాం. – **వి.సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు**

కలిసి అన్నం తిందామని వెళ్లి..

- కానరాని లోకాలకు..
- బైక్‌పై అదుపు తప్పి యువకుడి దుర్మరణం
- పోచమ్మ జాతరకు వచ్చి నీళ్ల కోసం వెళ్తుండగా ఘటన
- గుండెలు పగిలేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గడ్డం రాకేశ్(ఫైల్)



రాకేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

భీమిని: ఎల్లారం పోచమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పెంచికల్‌పేట్ మండలం గోంట్లపేట్ గ్రామానికి చెందిన గడ్డం రాములు–వెంకటమ్మ దంపతులు తమ ఇద్దరు కుమారులు, బంధువులు, మిత్రులతో కలిసి ఎల్లారం పోచమ్మ దర్శనానికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశాడు. మొక్కులు చెల్లించుకున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన వీరి చిన్నకుమారుడు గడ్డం రాకేశ్(22) ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని మొక్కుకున్నాడు. అనంతరం ఆలయం సమీపంలోనే విందు చేసుకునేందుకు అందరూ వెళ్లారు. అక్కడే వంటలు చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సిద్ధమయ్యారు.

చల్లని నీళ్ల కోసం వెళ్లి..

అన్నం తినడానికి చల్లని నీరు లేకపోవడంతో తీసుకు వస్తానని, వచ్చాక అందరం కలిసి అన్నం తిందామని కుటుంబ సభ్యులకు చెప్పిన రాకేశ్ తన మిత్రుడు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జాన్కాపూర్ వాటర్ ప్లాంట్ వద్దకు బయల్దేరారు. సబ్ స్టేషన్ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. రాకేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు..

డ్రైవర్‌గా పనిచేస్తూ.. కుటుంబానికి అండగా ఉంటున్న రాకేశ్ జాతరకు వెళ్లిన సమయంలో దుర్మరణం చెందిన విషయం తెలియడంతో జాతరకు వచ్చిన వారంతా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అప్పటి వరకు తమతో కలిసి దైవ దర్శనం చేసుకున్న రాకేశ్‌ను రోడ్డుపై విగత జీవిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న కన్నెపల్లి ఎస్సై గగారాం ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెల్మెట్ ఉండి ఉంటే...

పట్టుమని పాతికేళ్లు కూడా నిండని రాకేశ్, శ్రీకాంత్ జాతరకు వచ్చామన్న సంతోషంలో బైక్‌పై హెల్మెట్ లేకుండా వేగంగా దూసుకెళ్లారు. మూల మలుపు వద్ద బైక్ స్కిడ్ అయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇద్దరికీ తలకు గాయాలయ్యాయి. బైక్ నెమ్మదిగా నడుపుతూ హెల్మెట్ ధరించి రాకేశ్ ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పని దొరికిందని వెళితే.. ప్రాణం పోయింది



ఓదెలు మృతదేహం

బెల్లంపల్లి: పని దొరికిందని వెళ్లిన ఓ ఎలక్ట్రీషియన్ విద్యుత్ షాక్‌తో ప్రాణాలే కోల్పోయాడు ఈ ఘటన బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బెల్లంపల్లి బస్తీలోని ఒకరి ఇంట్లో సింగరేణి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అతను అదే బస్తీకి చెందిన బొల్లి ఓదెలు(35) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాడు. ఆదివారం పని దొరికిందని ఓదెలు మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ సరఫరా నిలిపివేయకుండానే స్తంభం ఎక్కి మరమ్మతులు చేపట్టాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై కింద పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఓదెలుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓదెలు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- తహసీల్దార్ కార్యాలయానికి వాహనాల తరలింపు



ప్రభుత్వ భూమి చదును చేసిన ట్రాక్టర్, జేసీబీని తహసీల్దార్ కార్యాలయంలో ఉంచిన దృశ్యం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ భూములను అక్రమార్కులు అన్యాక్రాంతం చేస్తూనే ఉన్నారు. ఆదివారం రాళ్లవాగును ఆనుకుని ఉన్న శిఖం భూమిని బ్లేడ్ ట్రాక్టర్, జేసీబీ సహాయంతో చదును చేస్తుండగా ఆర్‌ఐ అజీమ్ అడ్డుకున్నారు. వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సర్వే నంబరు 140 లోని దాదాపుగా 2 ఎకరాల శిఖం భూమిని ప్రభుత్వం గతంలోనే ఇరిగేషన్ అధికారులకు అప్పగించింది. ప్రభుత్వ భూమి కావడంతో, దానిపై చాలాకాలంగా కొందరు కన్నేశారు. కోట్ల రూపాయల విలువ గల రెండెకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు అందులో మొక్కలు నాటారు. ఆదివారం సెలవు కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు చదును చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను సీజ్ చేశారు. భూమిని కబ్జా చేసేందుకు ఎవరు ప్రయత్నించారనే సమాచారం మాత్రం తెలుసుకోలేక పోయారు. ట్రాక్టర్ డ్రైవర్లు మాత్రం తమకేమీ తెలియదని వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారని ఆర్‌ఐ తెలిపారు.

శ్రామిక భవన్ నిర్మాణానికి చేయూతనివ్వండి

- ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: ఐఎఫ్‌టీయూ శ్రీరాంపూర్ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి(శ్రామిక భవన్)ఆర్థికంగా, వస్తురూపంగా చేయూతనివ్వాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. నస్పూర్, శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. బొగ్గు గనుల కేంద్రమైన శ్రీరాంపూర్ డివిజన్‌లో కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి సీఎంపీఎఫ్ పెన్షన్, హస్పిటల్ బుక్స్, బోనస్ తదితర చట్టబద్ధ హక్కులు సాధించినట్లు తెలిపారు. విప్లవ కార్మికోద్యమ నిర్మాణానికి కేంద్రంగా ఉండి సమన్వయకర్తగా ఆఫీసులు పని చేయడానికి శ్రామిక భవన్ పేరిట శ్రీరాంపూర్ కార్యాలయ నిర్మాణం చేపట్టామన్నారు. ఈ భవన నిర్మాణానికి అన్నిరంగాల కార్మికులు, ప్రజలు, సంఘం అభిమానులు సాయం అందించలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.బ్రహ్మానందం, నాయకులు యాదగిరి, శోభ, జ్యోతి, సదానందం, అశోక్, సోమయ్య, అప్పారావు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్

- నకిలీ విత్తనాలపై స్పెషల్ ఫోకస్
- అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ సేకరణ
- రామగుండం సీపీ శ్రీనివాసులు




సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా కొంత మంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసిన విత్తనాలు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నకిలీ విత్తనాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని తెలిపారు. నకిలీ విత్తనాల స్మగ్లింగ్, అక్రమ రవాణాపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు పేర్కొన్నారు. వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో కొందరు నకిలీ విత్తనాలు గ్రామాలకు రవాణా చేస్తున్నారని తెలిపారు. విత్తన గోదాములు, దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని, గతంలో పట్టుబడినవారిపై నిఘా ఉంచాలని సూచించారు. వ్యావసాయశాఖ, ఇతర శాఖలకు చెందిన అధికారుల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విత్తనాల, ఎరువుల దుకాణాల్లో అకస్మిక తనిఖీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనుమానం ఉంటే విత్తన శాంపిళ్లు సేకరించి పరీక్షలకు ల్యాబ్‌కు పంపుతామని వెల్లడించారు. ప్రభుత్వం అందించే నాణ్యమైన విత్తనాలపై ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టపరిచి నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

'ప్రైవేటు'లో ఉచిత విద్య

- 1, 5వ తరగతి వారికి స్కూల్లో
- టెన్త్ చదివిన వారికి కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలు
- సద్వినియోగం చేసుకుంటే పేద విద్యార్థులకు లబ్ధి



మంచిర్యాలటౌన్: జిల్లాలోని పేద దళిత విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో టెన్త్ వరకు, టెన్త్ పూర్తయిన దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే, వారికి ఉచితంగా ప్రైవేటు పాఠశాలల్లో టెన్త్ వరకు, కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియెట్ ఉచితంగా చదువుకునేందుకు అవకాశం దక్కుతుంది.

పదో తరగతి వరకు..

2024–25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకం ద్వారా రెసిడెన్షియల్‌లో 5వ తరగతి, నాన్ రెసిడెన్షియల్‌లో 1వ తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లాకు మొత్తం 183 సీట్లు కేటాయించగా, అందులో 1వ తరగతికి 91 సీట్లు, 5వ తరగతికి 92 సీట్లు కేటాయించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్, సాయిబాబ టెంపుల్ దగ్గర గల ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలి. దరఖాస్తు ఫారాలు ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి.

ఇవి అవసరం..

దరఖాస్తు చేసుకునే వారు మీసేవ ద్వారా జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించని ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలి. విద్యార్థులు 01.06.2018 నుంచి 31.05.2019లోపు జన్మించి ఉండాలి. మీసేవ ద్వారా తీసుకున్న పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. 5వ తరగతిలో ప్రవేశాలకు 4వ తరగతి పాస్ అయిన మార్కుల జాబితా, బోనఫైడ్‌ను జతచేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, 3 పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలతో 5వ తరగతికి రెసిడెన్షియల్ స్కూల్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 1వ తరగతి వారు నాన్ రెసిడెన్షియల్‌కు దరఖాస్తు చేసుకుంటే, వీరి ఎంపిక ప్రక్రియ జూన్ 11న కలెక్టరేట్ సమావేశ మందిరంలో లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇతర వివరాలకు 9441333348 నంబరులో సంప్రదించవచ్చు.

కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ కోసం..

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 7 జీపీఏకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియేట్ ఉచితంగా చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన దివ్యాంగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకుచెందిన వారికి అవకాశం కల్పించారు. పదో తరగతిలో సాధించిన జీపీఏ, రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుని 2024–25లో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పించారు. కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివే విద్యార్థుల ఫీజును ప్రభుత్వం ఆయా కళాశాలల యాజమాన్యాలకు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల కోసం ఏడాదికి రూ.3 వేలు అందిస్తుంది. ప్రతీ సంవత్సరం కార్పొరేట్ కాలేజీల్లో ప్రభుత్వం అవకాశం కల్పిస్తుండగా, పేద విద్యార్థులు ఉన్నత చదువులను అందుకునేందుకు ఈ పథకం తోడ్పాటు అందిస్తోంది.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

ఇంటర్‌లో కార్పొరేట్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి వివరాలను, పదో తరగతిలో సాధించిన జీపీఏ, సెల్ నంబర్, ఈ మెయిల్ ఐడీ, కులం, ఆదాయం, నివాస, దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాల్సి ఉంటుంది. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలలకు చెందిన బోనఫైడ్‌లు, ఫొటోను సైతం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పదో తరగతిలో సాధించిన జీపీఏతోపాటు, వారి రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియను చేపడతారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన తొలి జాబితాను జూన్ 3వ తేదీన ప్రకటించి, జూన్ 6వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. ఎంపికైన వారికి ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం



జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు 1వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్‌లో, 5వ తరగతిలో రెసిడెన్షియల్‌లో ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు బెస్ట్‌అవేలబుల్ పథకం అవకాశం కల్పిస్తోంది. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్‌లో చదివేందుకు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు అర్హులు. జిల్లాకు చెందిన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– **పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి**

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై కేసు

నెన్నెల: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, మామ, అత్తతోపాటు ఆడబిడ్డ, ఆమె భర్తపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగుల మల్యాల రాజు, నెన్నెల మండల కేంద్రానికి చెందిన మౌనికతో గతేడాది జూన్ 14న వివాహం జరిగింది. పెళ్లి ఖర్చు కింద రూ.3 లక్షలు నగదు, తులం బంగారాన్ని మౌనిక తల్లిదండ్రులు ఇచ్చారు. సుమారు 3 నెలల పాటు సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం, మరో రూ.3 లక్షలు తీసుకురావాలంటూ భర్త రాజు, అత్త నాగుల మల్యాల అమ్మాయి, మామ ఆనందంలతోపాటు ఆడబిడ్డ బ్రమ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు వేధించసాగారు. పెళ్లయిన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు ఇంట్లో తలుపులు పెట్టి చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నాడు. బాధితురాలు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన శంకరయ్య

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట ప్రధాన రహదారిపై ఆదివారం అడవి పంది దాడిలో పశువుల కాపరి చిలువేరు శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. శంకరయ్య ఉదయం పశువులను మేతకు తీసుకెళ్తుండగా అడవి పంది దాడి చేసింది. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు (28) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుడి ఎడమ చేతి పై కుంత అని, కుడి చేతి భుజం పై త్రిశూల్ సింబల్ పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. మృతుడు షర్టు ధరించలేదని, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 8712658605 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జాడి గంగవ్వ(43) వడదెబ్బతో మృతిచెందింది. ఈనెల 15న వడదెబ్బతో అస్వస్థతకు గురికాగా, ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స పొందింది. గురువారం ఖానాపూర్, శుక్రవారం నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త లింగన్న, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇక ‘చేనేత’ ఎన్నికలు

- 12 ఏళ్లకు మోక్షం
- ఉమ్మడి జిల్లాలో రెండు సంఘాలు
- ఎన్నికలకు అధికారుల కసరత్తు

చెన్నూర్: చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పన్నెండేళ్ల తర్వాత ఎన్నికలకు మోక్షం లభించింది. ఎన్నికల నిర్వహణ కోసం చేనేత జౌళిశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల జిల్లా చెన్నూర్, కుమురం భీం జిల్లాలోని బెజ్జూర్‌లో సంఘాలు ఉన్నాయి. అధికారులు సభ్యుల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 240 మందికి పై సభ్యులు ఉన్నారు.

ఆరేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జిలే..

చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 11, 2013న ఎన్నికలు జరిగాయి. వీటి గడువు 2018 ఫిబ్రవరి 12న ముగిసింది. పదవీ కాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా జీవో 568 ప్రకారం పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. 2018 ఫిబ్రవరి నుంచి 2023 ఆగష్టు వరకు పర్సన్ ఇన్‌చార్జీలతో సహకార సంఘాల్లో కార్యకలాపాలు నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాలో నాడు 8 సంఘాలు..


మగ్గం వేస్తున్న చేనేత కార్మికుడు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకప్పుడు పది చేనేత సహకార సంఘాలతో జిల్లాలో చేనేత వస్త్రాలకు పెట్టింది పేరుగా నిలిచింది. సుమారు 8 వేల కుటుంబాలకు చేనేత సంఘాలపై ఆధారపడి జీవనం సాగించారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సంఘాలు డీలా పడ్డాయి. ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం చెన్నూర్, బెజ్జూర్‌లో రెండు చేనేత సహకార సంఘాల్లో కార్మికులు వస్త్ర ఉత్పత్తి చేస్తున్నారు.

చెన్నూర్ సంఘంలోనే అత్యధిక..

చెన్నూర్ చేనేత సహకార సంఘంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో మగ్గాలు నేస్తున్నారు. సుమారు 140 మందికి పైగా కార్మికులు ఉండగా బెజ్జూర్‌లో మాత్రం వంద మంది మాత్రమే కార్మికులు ఉన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాకే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నాం. పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం ముగిసింది. కొత్తగా ఎవరికి చార్జీ ఇవ్వలేదు. సంఘాల బలోపేతం కోసం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ఎన్నికలు నిర్వహిస్తాం.

– చరణ్ చేనేత జౌళిశాఖ కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ ఏడీ

ఎస్టీపీపీలో ఏం జరుగుతోంది!

- ఎనిమిదేళ్ల స్టోర్స్ మెయింటనెన్స్ స్పేర్‌స్పార్ట్స్‌పై విజిలెన్స్ తనిఖీలు
- ఒక్కటే మెయిన్ స్టోర్.. దాని సబ్‌స్టోర్స్ లేని వైనం
- అధికారుల ప్రాణాల మీదకు వస్తున్న ఎంక్వైయిరీ
- కలకలం రేపుతున్న యువ ఇంజినీర్ కిరీటి ఆత్మహత్య


జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

జైపూర్: జైపూర్‌లోని ఎస్టీపీపీలో విజిలెన్స్ తనిఖీలు సిబ్బంది ప్రాణాల మీదికి తెస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్లాంటులో రూ.కోట్ల విలువైన సామగ్రి విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో భాగంగా వినియోగిస్తుంటారు. సింగరేణి సంస్థ ప్లాంటు నిర్మించినప్పటికీ క్షేత్రస్థాయిలో నిర్వహణకు ఏర్పాట్లు చేయలేదు. ఐదేళ్లకోసారి వీటి బాధ్యతలకు ఓ ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. దాన్ని పర్యవేక్షించేందుకు నామమాత్రంగా అధికారులను నియమించింది. క్షేత్రస్థాయిలో సామగ్రిని స్టోర్ చేసే మెయిన్ స్టోర్ సబ్ స్టోర్స్ లేకపోవడం, విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా అధికారులు అవసరాలను బట్టి లక్షల విలువైన సామగ్రి వినియోగించడం ఏళ్ల గడిచాక విజిలెన్స్ తనిఖీ చేపట్టడం అధికారుల ప్రాణాలు తీస్తోంది.

వోఅండ్‌ఎం ఎస్‌ఈ బి.కిరీటి అనే యువ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకోవడం అధికార యంత్రాంగాన్ని కలవరపెడుతోంది. గతనెల 22న వారం పాటు విజిలెన్స్ బృందం ఎలాంటి ఫిర్యాదు అందకపోయినా మెయిన్ స్టోర్స్‌ను తనిఖీ చేసింది. వోఅండ్‌ఎం మెయింటనెన్స్ అధికారులను ప్రశ్నించింది. సామగ్రిని ఎప్పుడు తెచ్చారు.. ఎక్కడ వినియోగించారు. ఒకవేళ వినియోగించని పక్షంలో ఎక్కడ ఉంచారన్న ప్రశ్నలు అడిగారు. వోఅండ్‌ఎంలో బాయిలర్, టర్బైన్, ఎలక్ట్రికల్ మెయింటనెన్స్ అధికారులు మెయిన్ స్టోర్స్ నుంచి సామగ్రి విత్‌డ్రా చేసి స్పేర్స్, మోటార్స్, బేరింగ్స్, ఆయిల్స్ ఇలా ఎన్నో వినియోగిస్తారు. కొన్ని సందర్భాల్లో వినియోగించనివి అధికారులు వాళ్ల పరిధిలో భద్రంగా ఉంచారు. మీ వద్ద ఎందుకు ఉంచుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించడం, 8 ఏళ్ల తర్వాత తనిఖీ చేపట్టడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. క్షేత్రస్థాయిలో సరిపడగా ఇంజినీర్లు లేకపోవడం, ఉన్న వారిపై పని ఒత్తిడి చేయ డం, మరో వైపు విజిలెన్స్ విచారణ ఎదుర్కొలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా కిరీటి రెండు పేజీల సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇప్పటి వరకు ఉపయోగించిన సామగ్రి వివరాలు, విజిలెన్స్ బృందానికి అందించడానికి అధికార యంత్రాంగం నివేదిక తయారు చేసింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఆశ్రమ విద్యార్థులకు సమ్మర్ క్యాంపు
- 120 మంది బాల,బాలికలకు శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: వేసవి సెలవుల్లో క్రీడా శిబిరంలో బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కుమురం భీం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో ఈనెల 15 నుంచి సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. 31వ తేదీ వరకు జరిగే ఈ క్యాంప్‌లో 12 రకాల క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 60 మంది చొప్పున మొత్తం 120 మంది బాల,బాలికలకు వివిధ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. కోచ్‌లు క్రీడల్లో మెలకువలు, తర్ఫీదునిస్తున్నారు.

31 వరకు సమ్మర్ క్యాంప్

గిరిజన బాల, బాలికలకు క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ఈనెల 15 నుంచి 31 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాలల నుంచి కుమురం భీం జిల్లా నుంచి 60 మంది, మంచిర్యాల జిల్లా నుంచి 60 మందిని బాల, బాలికలను ఎంపిక చేశారు. ఉదయం 5:30 నుంచి 7:30 వరకు, సాయంత్రం 5 నుంచి 7:00 గంటల వేళలో క్రీడా శిక్షణ కొనసాగుతోంది. 15 మంది కోచ్‌లతో 12 రకాల క్రీడల్లో తర్ఫీదునిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది నిర్వహించిన క్యాంపుతో స్పందన వచ్చింది. అథ్లెటిక్స్ విభాగంలో ముగ్గురు జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు. 27 మంది జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నారు.

ఒక్కో క్రీడకు ఇద్దరు కోచ్‌లు

ఒక్కో క్రీడకు ఇద్దరు కోచ్‌లు ఉన్నారు. వివిధ ఆటలపై బాల,బాలికలకు శిక్షణ అందిస్తున్నారు. అథ్లెటిక్స్‌కు విద్యాసాగర్ ఈయన ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య నిర్వహించిన లెవల్ 1,2 పరీక్షల్లో అర్హత సాధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏకైక శిక్షకుడు. ఈయన వద్ద శిక్షణ పొందిన 15 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో పాల్గొన్నారు. 30 మంది రక్షణ దళంలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన ప్రస్తుతం ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలకు శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. హ్యాండ్ బాల్‌కు అరవింద్, ఖోఖోకు తిరుమల్, సుమలత, బాక్సింగ్‌కు శేఖర్, వంశీ, కబడ్డీకి కృష్ణమూర్తి, మధుసూదన్, చెస్‌కు రవీందర్, లక్ష్మణ్, వాలీబాల్‌కు కోచ్‌లుగా శ్రీనివాస్, సుభాష్ ఉన్నారు. వీరితో పాటు ఆసిఫాబాద్ డీఎస్‌వో మీనారెడ్డి, మంచిర్యాల డీఎస్‌వో జీవరత్నం పర్యవేక్షణలో డీటీడీవో సమక్షంలో సమ్మర్ క్యాంపు కొనసాగుతుంది.


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


బాక్సింగ్ నేర్పుతున్న కోచ్

నాకు ఖోఖో ఇష్టం



ఖోఖో అంటే ఇష్టం. సమ్మర్ క్యాంపులో కోచ్‌లు మెలకువలు నేర్పిస్తున్నారు. ఆటల్లో తర్ఫీదు ఇస్తున్నారు. గతంలో రాష్ట్ర స్థాయి గోల్డ్‌మెడల్ సాధించాను. జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ తన లక్ష్యం.

– నాగేశ్వరి, జైనూర్

జాతీయస్థాయిలో రాణిస్తా



హ్యాండ్‌బాల్ పోటీలో గతంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాను. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాలని ఉంది. సమ్మర్ క్యాంపులో మంచి శిక్షణ ఇస్తున్నారు.

– సత్యభామ, ఆసిఫాబాద్

ఆర్మీ జవాన్ అవ్వాలని..



రన్నింగ్‌లో మూడు సార్లు గోల్డ్ మెడల్, రెండు సార్లు సిల్వర్ మెడల్ సాధించాను. ఆర్మీ జవాన్ అవ్వాలని ఉంది. అందుకే రన్నింగ్ చేస్తున్నాను. జవాన్ అయి దేశానికి సేవ చేయాలని ఉంది.

– ఆకాశ్, జన్నారం

సంతోషంగా ఉంది



నేను తిర్యాణి స్కూల్ నుంచి వచ్చాను. కోచ్‌లు ఉదయం, సాయంత్రం పూట క్రీడల్లో మెలకువలు నేర్పుతున్నారు. పీటీ సార్ రోజు వాలీబాల్ ఆడించేవారు. ఇక్కడ అందరితో ఆడితే సంతోషంగా ఉంది.

– శివమణి, తిర్యాణి

కోచ్ కావాలని ఉంది



క్రీడల్లో ప్రతిభ కనబర్చి కోచ్ అయి గిరిజన విద్యార్థులకు క్రీడల్లో మెలకువలు నేర్పించాలి. ఇటీవల వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయిలో తృతీయ స్థానం వచ్చింది. – వరలక్ష్మి, లక్సెట్టిపేట

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికితీయడానికి గిరిజన శాఖ ద్వారా అందిస్తున్న సమ్మర్ శిక్షణ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రమాదేవి, డీటీడీవో, కుమురంభీం జిల్లా

రైల్వే ట్రాక్‌మెన్ ఉద్యోగుల నూతన కార్యవర్గం


కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రామ్మూర్తి

మంచిర్యాలక్రైం: సౌత్ సెంట్రల్ రైల్వే ట్రాక్‌మెన్ల ఎంప్లాయ్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ అధ్యక్షుడు జిలకర రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కళ్ల ప్రభాకర్, మీసాల శేఖర్ ఆధ్వర్యంలో కాజీపేటలోని ఎస్సీ, ఎస్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఎన్నుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నక్కల రాజు, డివిజన్ కార్యదర్శిగా కట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కారంగుల నాగరాజు, ట్రెజరర్‌గా మొరపూటాల మల్లేశ్, అసిస్టెంట్ డివిజన్ కార్యదర్శులుగా గుళ్ల శ్రీనివాస్, వీర్ల రాధాకృష్ణ, ఆవుల కుమార్, కె.శరత్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

- తరుచూ ట్రాక్‌మెన్‌లు రన్ ఓవర్ బారినపడి చనిపోతున్నారు. దీనిపైన రైల్వే బోర్డ్ సమక్షంలో సమగ్రమైన సేఫ్టీ కమిషన్ ఏర్పాటు చేసి ట్రాక్‌మెన్ మరణాలను తగ్గించాలి.
- ట్రాక్ మెన్ ప్రాణాల రక్షణకు రక్షక్ పరికరాలు ఇవ్వాలి.

రైల్వేలో సేఫ్టీ విధులకు దూరంగా ఉన్న సీనియర్ ట్రాక్‌మెన్‌లను ఓపెన్ లైన్‌లోకి పంపించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.

ఆకాశంలో అద్భుతం


ఆకాశంలో కనిపించిన నక్షత్రాల వరుస

చింతలమానెపల్లి/బెజ్జూర్: జిల్లాలో ఆదివారం రాత్రి ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. రాత్రి 8 గంటల ప్రాంతంలో చింతలమానెపల్లి మండల కేంద్రంలో సుమారు 20 వరకు నక్షత్రాలు వెలుగుతూ నిమిషంపాటు కనిపించాయి. బెజ్జూర్‌లో నక్షత్రాలు కనిపించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. ఇలాంటి దృశ్యం ఎప్పుడూ చూడలేదని స్థానికులు తెలిపారు. జిల్లా అంతటా ఈ నక్షత్రాలపై చర్చించుకున్నారు.

‘ఉమర్‌మియా’ బాధితులకు ఊరట

- సొసైటీ సభ్యులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు
- 17 మందికి అనుమతులు ఇవ్వాలని ఉత్తర్వులు


హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని చూపిస్తున్న ఉమర్‌మియా సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఉమర్‌మియా హౌసింగ్ సొసైటీ వివాదంలో, అందులో ప్లాట్లు కొని మున్సిపల్ అనుమతులు రాక ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న 17 మందికి ఊరట లభించింది. వారికి అనుకూలంగా హైకోర్టు తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. 1978లో ఏర్పడిన ఉమర్‌మియా హౌసింగ్ సొసైటీ భూముల్లో వివాదాలు సృష్టిస్తూ, కొందరు కౌన్సిలర్లు ఇబ్బందులకు గురిచేస్తూ దాదాపుగా 40కి పైగా కేసులను వేశారని తెలిపారు. ఇందులో 86 మందికి ప్లాట్లు ఉండగా, 30కిపైగా ఇళ్ల నిర్మాణాలను చేశారని, ఆ తరువాత కొన్ని దొంగ రిజిస్ట్రేషన్లను చేసి, అసలైన యజమానులకు ఇబ్బందులను సృష్టించారని పేర్కొన్నారు. కేసులతో ఇన్నాళ్లు ఇబ్బంది పడిన తమకు హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఊరట లభించిందని తెలిపారు. ఉమర్‌మియాకాలనీ మంచిర్యాల పట్టణానికే రెండో పట్టణం అని, 1978లో లేఔట్ ఏర్పడి, వంద ఫీట్ల రోడ్డుతో, కాలనీలో 30 ఫీట్ల రోడ్లతో, ఎకరం పావు పార్కు స్థలంతో ఏర్పడిన కాలనీ అని వివరించారు. ఈ కేసులను గెలిచేందుకు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాధాకృష్ణ, రిటైర్డ్ టీపీవో ఉదయ్‌కుమార్ సహకారంతో ఇన్నాళ్లు పోరాటం చేసి, పార్కు స్థలంను, తమ భూములను కాపాడుకున్నామని వెల్లడించారు. ఉమర్‌మియా కాలనీ అంటే అదో సమస్యాత్మకమైన ఏరియా అంటూ అపోహలను సృష్టిస్తూ, దొంగ రిజిస్ట్రేషన్ల ద్వారా కోట్ల రూపాయలను కొందరు కౌన్సిలర్లు కొల్లగొట్టారని ఆరోపించారు. కోర్టు కేసుల ద్వారా ఇన్నాళ్లు 17 మందికి మున్సిపల్ నుంచి అనుమతులు రాలేదని, కేసులను హైకోర్టు కొట్టివేసి, 17 మందికి అనుమతులను ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. కోర్టు తీర్పు ప్రకారంగా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వాలని లేకుంటే కోర్టు ధిక్కరణ కింద మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్తామని, అనుమతులను పొందడంతోపాటు, పార్కును, స్థలాలను కాపాడుకుంటామని చెప్పారు. సమావేశంలో ఉమర్‌మియా సొసైటీ అధ్యక్షుడు జుబేరా అహ్మద్(మినాజ్), ఉపాధ్యక్షుడు శ్రీపతి కేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నరేశ్, ఎండీ.హైదర్, ఆకుల బుచ్చన్న, చెక్క రాజన్న పాల్గొన్నారు.


రామకృష్ణాపూర్: సీవీ రామన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



తాంసి: కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


మంచిర్యాలటౌన్: ఎంవీఎస్ డిగ్రీ పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం


జైనథ్: గురువులతో పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీవీ రామన్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం సుమారు 150 మంది పాఠశాలలో కలుసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి పాఠశాల కరస్పాండెంట్ గురిజాల రవీందర్‌రావు, హెచ్‌ఎంలు సురేందర్‌రావు, పెద్దపెల్లి ఉప్పలయ్య, చిరంజీవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. గురిజాల రవీందర్‌రావు రచించిన బొగ్గురవ్వలు పుస్తకాన్ని కార్యక్రమంలో ఆవిష్కరించారు.

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మైక్రో బయాలజీ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సహ విద్యార్థి జిల్లా రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు మహేందర్‌ను సన్మానించారు. రాజేశ్, మల్లాగౌడ్, రమేశ్, నరేశ్, స్రవంతి, స్వప్న, హారిక, అనిత, సురేశ్ పాల్గొన్నారు.

కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 34 ఏళ్ల అనంతరం దాదాపు 50మంది పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నారాయణ రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులను సన్మానించారు.

జైనథ్‌లో..

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకచోట చేరారు. పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.


కుభీర్ ఉన్నత పాఠశాలలో..

కుభీర్‌లో..

కుభీర్: కుభీర్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. మేమున్నాం ట్రస్ట్ ద్వారా విరాళాలు సేకరించి తోటివారిని ఆదుకుంటామన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రంజిత్‌గౌడ్, జీవన్, చంద్రశేఖర్, వికాస్, అనిల్, ప్రగతి, సవిత, సంగీత, పద్మ, ఉపాధ్యాయులు జి.దత్తాత్రి, విజయ్‌కుమార్, సదానంద్, గజరాజ్‌గౌడ్, మల్లాగౌడ్, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.